క్లుప్తంగా

నేడు నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ముకుందా ఫీడర్ మెయింటెనెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈఈ కె. రాంబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి కారణంగా విప్పర్ల రెడ్డిపాలెం, సంతగుడిపాడు, మర్రిచెట్టుపాలెం, విప్పర్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈఈ రాంబాబు కోరారు.

ప్రమాదవశాత్తు బైకు దగ్ధం



నూజెండ్ల: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన మండలంలోని చింతలచెర్వు గ్రామ సమీపాన పోలేరమ్మ దేవాలయం పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని కొండ్రాయునిపాలెం గ్రామానికి చెందిన కోనంగి సుబ్బారావు తన భార్య ఇరువురు కలిసి హీరోహోండా ద్విచక్ర వాహనంపై దర్శిలో శుభాకార్యం చూసుకొని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈక్రమంలో ప్రకాశం జిల్లా కురిచేడు గ్రామంలో తన బైకులో పెట్రోలు కొట్టించుకొని వస్తుండగా మార్గమధ్యంలో పోలేరమ్మ గుడి పరిధిలో బైకు ప్లగ్ బిట్ నుంచి పొగరావటాన్ని గమనించాడు. తక్షణమే రోడ్డు పక్కనే బైకును నిలుపుదల చేసి దూరంగా వెళ్లారు. దీంతో బైకు నుంచి మంటలు పెద్ద ఎత్తున వచ్చాయి. సమీపంలో మంటలను అదుపులోకి తీసుకొని రావటానికి ఎటువంటి నీటి సౌకర్యం లేకపోవటంతో నివ్వెరపోయారు. వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో ఈసంఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

గుడిలో సీసీ కెమెరాల ధ్వంసంపై కేసు నమోదు

యడ్లపాడు: గ్రామదేవత గుడిలో సీసీ కెమెరాలు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని లింగారావుపాలెం గ్రామంలోని గంగమ్మ తల్లి గుడిలో ఇటీవల కొలుపులు నిర్వహించారు. అయితే వీటికి సంబంధించి కొందరు ఈనెల 2వ తేదీన గుడిలో దీపారాధన చేశారు. ఈ విషయంపై సదరు గుడికి చెందిన మరికొందరితో దీపారాధన చేసిన వారితో వాగ్వాదం జరిగింది. ఇదే తరహాలో గతంలోనూ ఒకమారు వాగ్వాదం నెలకొన్న నేపథ్యంలో పోలీసులు ఇరువర్గాల వారిని పిలిపించి సఖ్యత చేసి పంపించినా ఫలితం లేకపోవడం, ఆ తర్వాత గుడిలో సీసీకెమెరాలను ధ్వంసం చేయడం జరిగింది. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంటావారిపాలెంలో ఆలయ వార్షికోత్సవం



శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీగంగా పార్వతీ సమేత శ్రీసోమేశ్వర స్వామి దేవాలయం 8వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభమైనట్లు ఆలయ పూజారి సౌభాగ్యశర్మ తెలిపారు. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త ప్రముఖ వ్యాపారవేత్త సత్యసీడ్స్ అధినేత కొసనా రామకోటేశ్వరరావు-ధర్మపత్నీ కృష్ణవేణి దంపతులచే స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నంశెట్టి నాగేశ్వరరావు, కర్లా శ్రీనివాసరావు, వడ్రాణం నాగేశ్వరరావు, మలిశెట్టి నరేష్, తేలంబ్రోలు రవిబాబు, చెన్నా ప్రసాదు గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలంలో ప్రధానోపాధ్యాయుల బదిలీలు

నూజెండ్ల: విద్యాశాఖలో బదిలీలు పూర్తయ్యాయని మండల విద్యాశాఖాధికారి రవిచంద్ర మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని నాలుగు జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో నూతనంగా ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారన్నారు. నూజెండ్ల జెడ్పీలో బి.శ్రీదేవి, కంభంపాడుకు యం.వెంకటనాగ బసవయ్య, ములకలూరు టి.శ్రీలక్ష్మి, పాత నాగిరెడ్డిపల్లె పాఠశాలకు వి.జానకి బదిలీపై రావటం జరిగిందని తెలిపారు. మండలం నుంచి ప్రాథమిక పాఠశాలల్లో ఉప్పలపాడు నుంచి రవి, ఐనవోలు పద్మజ, బుర్రిపాలెం పాఠశాల నుంచి కోటేశ్వరావు, రవ్వవరం కృష్ణారావు, చెరువుకొంపాలెం పాఠశాల నుండి విజయలక్ష్మిలు బదిలీపై వెళ్లారని యంఈవో అన్నారు.

ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను నివారించవచ్చు

యడ్లపాడు: క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తిమ్మాపురంలోని ఎస్సీ కాలనీలో నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కార్యకర్తలు, ఆషాలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, రాకకు గల కారణాలు, నివారణ మార్గాలు, వైద్య పరీక్షల ప్రాముఖ్యతపై వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా రెండవ ప్రధాన మరణ కారణంగా నిలుస్తోందన్నారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణకుమారి, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వై ప్రసాద్‌రావు, డీఈఓ ఎం సాంప్రసీత్, ఏఎన్ఎం నాగమణి, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు చంద్రబాబు వెన్నుపోటు

- మాజీ మంత్రి విడదల రజిని ధ్వజం
- మోటార్ బైక్ ర్యాలీలను అడ్డుకున్న పోలీసులు
- చిలకలూరిపేట, వినుకొండ, నరసరావుపేటల్లో నిరసన ర్యాలీలు



తహసీల్దార్ ఎస్‌కేఎండీ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: తల్లికి వందనం పేరుతో మహిళలకు వెన్నుపోటు... రైతు భరోసా చెల్లించకుండా రైతులకు వెన్నుపోటు... ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా రోగులకు సైతం వెన్నుపోటు... ఇలా బాబు ష్యూరిటీ అంటేనే వెన్నుపోటు గ్యారెంటీ అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటుదినం నిర్వహించారు. ఎన్ఆర్టీ రోడ్డులోని మాజీ మంత్రి విడదల రజిని నివాసం నుంచి మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధం కాగా అర్బన్ సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు మరో మహిళా సీఐ, నియోజకవర్గ పరిధిలోని ఎస్ఐలతో వచ్చి బైక్ ర్యాలీ పర్మిషన్ లేదంటూ అడ్డుకున్నారు. దీంతో మండే ఎండలో సైతం పాదయాత్రగా ఎన్ఆర్టీ రోడ్డు, ఎన్ఆర్టీ సెంటర్, చౌత్రా సెంటర్, మెయిన్‌బజార్, గడియార స్తంభం సెంటర్, కేబీ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర కొనసాగింది. కొత్త పథకాలు లేవు, ఉన్న పథకాలు రద్దు... రైతులను నమ్మించావు, ఓటేశాక నిండా ముంచావు... బాబు ష్యూరిటీ వెన్నుపోటు గ్యారెంటీ... ఈవెంట్ల గవర్నమెంట్, ప్రజలకు నో బెనిఫిట్... ఏడాది పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ... ఎదురిస్తే అక్రమ కేసులు వంటి నినాదాలతో దారి పొడుగునా యువత హోరెత్తించారు.

అన్ని హామీలు హుష్‌కాకి...

తహసీల్దార్ కార్యాలయం వద్ద విడదల రజిని మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తో సహా 143 హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థి తల్లికి వందనం పథకం కింద రూ. 15 వేలు ఇస్తామని చెప్పి మోసగించారన్నారు. ఆడబిడ్డ నిధి కింద 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు వయసు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ. 1500 చొప్పున ఏడాదికి రూ. 18 వేలు అందిస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆడబిడ్డ నిధి ఊసే ఎత్తకపోవడం మోసం కాదా అని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ. 20వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగభృతి పేరుతో యువతను వంచించారని, అన్ని హామీలు గాలికి వదిలి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, హామీలను అమలు చేయలేక పాలనావైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో తగు విధంగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఎస్‌కేఎండీ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ దరియావలి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, కార్యదర్శి వలేటి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి ఉడతా వెంకటేశ్వరరావు, ఐటీ విభాగం రీజినల్ కోఆర్డినేటర్ పాలూరి అంజిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



చిలకలూరిపేట ర్యాలీలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న యువత



బైక్ ర్యాలీ అడ్డుకుంటున్న అర్బన్ సీఐ రమేష్

యడ్లపాడు నుంచి

యడ్లపాడు: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమానికి యడ్లపాడు మండలానికి చెందిన పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వివిధ గ్రామాల నుంచి పార్టీ అభిమానులు తమ తమ బైకులకు వైఎస్ఆర్సీపి జెండాలు కట్టుకొని చిలకలూరిపేట పట్టణానికి ఉత్సాహంగా బయలుదేరారు. మాజీమంత్రి విడదల రజిని నివాసం వద్ద నుంచి ప్రారంభమైన భారీర్యాలీలో పార్టీ జెండాలు, ప్లకార్డులు చేతబట్టి, నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ మద్దూరి విజయబాలచంద్రారెడ్డి, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు బసెల శివరామకృష్ణ, నాయకులు గౌరు హనుమంతరావు, షేక్ గౌస్‌సందానీ, షంషుజుహ, వి శ్రీనివాసనాయక్, పఠాన్ రెహమాన్, పాలూరి శ్రీనివాసరెడ్డి, పందుల బుల్లబ్బాయి, వైయస్ కరిముల్లా, గుత్తి సింగయ్య, నాగమల్లేశ్వరరావు, రాయపాటి చైతన్య, నాని, తెనాలి అంకమ్మరావు, సైదులు, ఉదయ్‌కుమార్, పల్లపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న యడ్లపాడు వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అరాచక పాలనకు చరమగీతం పాడండి

వెన్నుపోటు దినంలో పిలుపు ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేటలో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి ఏడాదిగా ఒక్క హామీని అమలుచేయకుండా రెడ్‌బుక్ పేరుతో దుర్మార్గమైన అరాచకపాలన చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయంవరకు నిర్వహించిన వెన్నుపోటు దినం ర్యాలీలో పార్టీ శ్రేణులు, ప్రజలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మధులతకు ఈ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అవినీతి, అరాచకంపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసానికి విస్తుపోయిన ప్రజానీకం వెన్నుపోటు దినోత్సవ నిరసన ర్యాలీలో వేలాదిగా పాల్గొన్నారన్నారు. ఏడాదిగా ఈ ప్రభుత్వం రూ.1.50 లక్ష కోట్లు అప్పు చేసిందని, ఒక్క పథకం కూడా ప్రజలకు అమలు చేయకుండా, ఈ డబ్బంతా ఏం చేశారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రూ.4లక్షల కోట్లు అప్పు చేసినప్పటికీ రూ.2.70లక్షల కోట్లు వివిధ పథకాల ద్వారా ప్రజలకు ఇచ్చారన్నారు. ఇప్పుడు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ప్రజలకు ఇచ్చిన పాపాన పోలేదని, ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనని వారి దృష్టి మళ్లించేందుకు తమ పార్టీకి చెందిన నాయకులను రోజుకు ఒకరి చొప్పున జైళ్లల్లో పెట్టి చిత్ర హింసలు పెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కూడా వదలకుండా కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. ఒక ఏడాదిగా ఇంత ప్రజా వ్యతిరేకత మూట కట్టుకున్న ప్రభుత్వం దేశంలో మరొకటిలేదని చెప్పారు. ఈ నిరసనకు పార్టీ శ్రేణులు వేల సంఖ్యలో పాల్గొన్నారని, ప్రజలు ఇంకా భయంతో నిరసన కార్యక్రమాలలో పాల్గొనటానికి బయటికి రావట్లేదని, వారేవస్తే ఈ ప్రభుత్వం ఏమవుతుందో ఆలోచించుకోవాలని సూచించారు. పోలీసులు తమ పార్టీ నాయకులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొనకుండా బెదిరింపులకు పాల్పడ్డారని, పల్నాడు జిల్లా యువత అధ్యక్షుడిని సైతం అరెస్టు చేశారని, బైకులపై వస్తున్న కార్యకర్తలని రానీయకుండా అడ్డుకున్నారని, అయినప్పటికీ కార్యక్రమంలో వేలాదిగా పోటెత్తారని చెప్పారు. ఈరోజు ఎండియు ఆపరేటర్స్ 20వేల మందిని తొలగించడం జరిగిందని, ఆదేంటంటే వీరు బియ్యం అమ్ముకుంటున్నారని నిందలు వేస్తున్నారని అన్నారు.

ఎమ్మెల్యే ఏమి మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియట్లా

స్థానిక ఎమ్మెల్యే అరవిందబాబు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియట్లేదని గతంలో జరిగిన ఎన్నికల్లో అక్రమాలు మేము చేశామని అంటున్నాడని, అసలు నరసరావుపేటలో మున్సిపల్ ఎన్నికలు ఎక్కడ జరిగాయని, ఏ ఎలక్షన్ జరిగిందో, ఏది జరగలేదో ఆయనకే అర్థంకానీ పరిస్థితిలో ఉన్నాడని అన్నారు. ఏడాదిగా చేస్తున్న కూటమి పరిపాలనలో తమను ప్రభుత్వం మోసం చేస్తుందన్న సంగతి ప్రజలు గ్రహించారన్నారు. ఒక్క రూపాయి కూడా తల్లికి వందనం పథకానికి వేయలేదని, ఈ పథకం అమలు చేయాలంటే వాళ్ళ బ్యాంక్ అకౌంట్లు తీసుకోవాలని, ఇంతవరకు ఆ ప్రక్రియ మొదలు పెట్టలేదని, ఆర్టీసీ ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నాటికి చేపడుతాం అంటున్నారని, ఈ పథకం చేపట్టాలంటే రూ.3వేలకోట్లు కావాలని, రెండు వేల మంది డ్రైవర్లు, కండక్టర్లు నియమించుకోవాలని, ఇంతవరకు ఒక్క నియామకం, ఒక కొత్త బస్సు కూడా కొనకుండా ఈ పథకాన్ని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.

కేసులు పెట్టి జైలుపాలు చేసినా భయపడం

కార్యక్రమ పరిశీలకులు, పార్టీ జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు పానుగంటి చైతన్య మాట్లాడుతూ 143 హామీలు ఇచ్చి ఏ ఒక్కటి అమలుచేయలేదని అన్నారు. మంత్రి లోకేష్ ఒక రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో తమ పార్టీకి చెందిన వారిని జైళ్లపాలుచేసి హింసలు పెట్టినా ఆదిరేది బెదిరేది లేదని అన్నారు. ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఇయం స్వామి మాట్లాడుతూ మహిళా లోకానికి వెన్నుపోటు పొడిచిన మహానుభావుడు చంద్రబాబు నాయుడని అన్నారు. మైనార్టీ నాయకుడు షేక్ కరిముల్లా మాట్లాడుతూ ఏడాదికాలంలో ఏ వర్గాన్ని వదలకుండా అందరినీ కూటమి నాయకులు వెన్నుపోటు పొడిచారన్నారు. సోషల్ యాక్టివిస్టు ఈదర గోపీచంద్ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, డాక్టర్స్ విభాగ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతు విభాగ జిల్లా అధ్యక్షులు అన్నెంపున్నారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పచ్చవ రవీంద్రబాబు, జిల్లా కోశాధికారి అన్నా చంద్రమోహన్, జిల్లా యాక్టివ్ సెక్రటరీలు జి.అచ్యుతరావు, గెల్లి చినకోటిరెడ్డి, జిల్లా అఫీషియల్ స్పోక్ పర్సన్ రాపోలు శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీలు షేక్ మహమద్‌గౌస్, పల్లపు అంజయ్య, జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షులు షేక్ రెహమాన్, గిరిజన మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, నియోజకవర్గ బీసీ విభాగ అధ్యక్షులు మర్రిపూడి రాంబాబు, మాజీ చాంబర్ అధ్యక్షులు కొత్తూరి కిషోర్‌బాబు, పట్టణ బీసీసెల్ అధ్యక్షులు అచ్చి శివకోటి, నరసరావుపేట, రొంపిచర్ల మండల కన్వీనర్లు మోరబోయిన శ్రీనివాసరావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, నాయకులు కనకాపుల్లారెడ్డి, చింతగుంట రాధాకృష్ణారెడ్డి, హాలీవు డ్‌రఘు, కందుల ఎజ్రా, ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.



ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

ఇచ్చిన హామీలకు వెన్నుపోటు: బొల్లా బ్రహ్మనాయుడు



తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు వినతిపత్రం అంజేస్తున్న బొల్లా

వినుకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిఏడాది అయినప్పటికీ ఇచ్చినహామీలు అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడినందుకు నిరసనగా పార్టీపిలుపు మేరకు నిర్వహించిన వెన్నుపోటు దినోత్సవ ర్యాలీ విజయవంతమైంది. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు మాజీఎమ్మెల్యే బొల్లాబ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో ఐదుమండలాల నుంచి వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చారు. ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి పల్నాడురోడ్డు శివయ్య స్థూపం సెంటరు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం తహసీల్దార్ సురేష్ నాయక్‌కు బొల్లాతో పాటు నాయకులు కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు.

మైక్ పర్మిషన్ లేదని అడ్డుకున్న పోలీసులు

పార్టీపిలుపు మేరకు వేలాదిమంది అభిమానులు కార్యకర్తలు తరలిరావటంతో పల్నాడు రోడ్డు జనసంద్రమైంది. కార్యకర్తలు నినాదాలు చేస్తూ వస్తున్న తరుణంలో ర్యాలీ బాలాజీ హాస్పిటల్ వద్దకు రాగానే పోలీసులు మైక్‌కు పర్మిషన్ లేదంటూ అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలు ఒక్కసారిగా పోలీసు చర్యలపై మండిపడ్డారు. ఇంతలో బొల్లా కలుగజేసుకుని మైకులేనంత మాత్రాన ర్యాలీ ఆగదని మైకు లేకుండానే ర్యాలీ కొనసాగించారు.

సంక్షేమానికి బదులు అరాచక పాలన: బొల్లా

ఎన్నికలముందు చంద్రబాబు కూటమి నాయకులు సూపర్ 6 పేరుతో 143 హామీలు ఇచ్చారని అవి అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేస్తూ అరాచక పాలన చేస్తున్నారన్నారు. అమలు చేయలేని హామీలిచ్చి.. ఓట్లు వేయించుకుని.. గెలిచి ప్రజలను వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. జనసేన అధినాయకుడు పవన్‌కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో తన కార్యకర్తలకు కనీసం నామినేటెడ్ పదవులు కూడా ఇప్పించుకోలేక, కూటమి అరాచకాలు ప్రశ్నించలేని స్థితిలో ఉన్నాడని విమర్శించారు. రాష్ట్రంలో 30 వేలమంది ఆడపడుచులు అదృశ్యమైయ్యారని తమప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి వారిని రప్పిస్తామని చెప్పిన పవన్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నారా లోకేష్ భారత రాజ్యాంగం కంటే భిన్నంగా రెడ్‌బుక్ పాలన తెచ్చిన లోకేష్ బ్రిటీష్ వారికంటే దారుణంగా వ్యవహరిస్తున్నాడని, రెడ్‌బుక్ పేరుతో ఐదేళ్ల క్రితం కేసులు తిరగదోడి దారుణంగా హింసిస్తున్నాడని విమర్శించారు. ఇక వినుకొండ ఎమ్మెల్యే జీ.వి ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్యకర్తలు కొండలు, చెరువులు కూడా వదలకుండా మట్టి అమ్ముకుంటున్నారన్నారు. ఇదిలా ఉంటే ర్యాలీ ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలీసులు నిఘా కొనసాగింది. ఇంటలిజెన్స్ పోలీసులు, ర్యాలీ ప్రజలను అంచనావేయడం డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టడం గమనార్హం పోలీసులు ర్యాలీలు అడ్డుకోవడం కంటే అసాంఘిక కార్యకలాపాలు ఆపాలని హితవు పలికారు. కనీసం ఉద్యోగధర్మం ప్రకారం పనిచేయాలని సూచించారు. రోజులు ఎప్పుడూ ఒకేలాగా ఉండవని గుర్తుంచుకోవాలన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

6 నుంచి ఉపాధి పనుల క్షేత్రస్థాయి తనిఖీలు

యడ్లపాడు: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై ఈనెల 6వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామస్థాయి సామాజిక తనిఖీ బృందానికి శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. స్టేట్ రిసోర్స్ పర్సన్ బి.అవులయ్య వివరిస్తూ మండలంలోని పంట కాలువలు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, పండ్ల తోటలు, సీసీ రోడ్లు, సచివాలయ భవనాలు, గోకుల షెడ్‌లు, పేదల కోసం నిర్మించిన ఇళ్ల వంటి మొత్తం 1122 ఉపాధి పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు.



విలేజ్ సోషల్ ఆడిటర్స్‌కు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఇందుకోసం 8 మంది డీఆర్పీలు, 20 మంది వీఎస్ఏలు క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. ఈ మేరకు వీఎస్ఏ సభ్యులకు ఈనెల 1 నుంచి శిక్షణ ఇవ్వబడుతోందని తెలిపారు.

నేడు అయ్యప్ప స్వామి దేవాలయానికి భూమిపూజ

నాదెండ్ల: గణపవరం-చిలకలూరిపేట వెళ్ళేడొంక రోడ్డు కుప్పగంజివాగు సమీపంలో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం శంకుప్రతిష్టా మహోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవాసంఘం సభ్యులు తెలిపారు. ఉదయం 7.52 గంటలకు భూమిపూజ, శంకుస్థాపన మహోత్సవం జరగనుంది. ఆలయానికి మండలనేని లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు భూమిని దానంగా అందిస్తున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డు కోటబజారు పులుపులవారి వీధిలో వేంచేసియున్న శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి వైభవ్ జ్యువెలరీస్ అధినేత పెనుగొండ వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య రత్నకుమారి, కుమారులు ప్రభాకర్, ప్రతాప్‌లు రూ.3 లక్షలు విరాళంగా అందించారు. ఈమేరకు ఆలయం వద్ద ఆలయ కమిటీ ప్రతినిధులు వనమా కృష్ణ, కోవూరి శివశ్రీనుబాబు, గజవల్లి మురళీలకు విరాళం మొత్తాన్ని అందించారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గం ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు సుదీర్ఘ కాలం భాద్యతలు నిర్వహించారు. అలాగే పట్టణానికి చెందిన కాకరపర్తి అంకుప్రసాదు దంపతులు రూ.25,116లు, దుడ్డు వెంకటరావు దంపతులు రూ.25,116లు విరాళంగా అందించినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.



రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు శూన్యం

నాదెండ్ల: కూటమి ఏడాది పాలనలో ప్రజల మన్ననలు పొందలేకపోయిందని, సంక్షేమ పథకాల అమలు శూన్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి చెప్పారు. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో బుధవారం మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేస్తామని గద్దెనెక్కి, ఏడాదైనా నేటికీ ఒక్క పథకాన్నీ అమలు చేయలేదని మండిపడ్డారు. 147 హామీల్లో ఎన్ని హామీలు నెరవేర్చారో కూటమి నాయకులు నిజాయితీగా ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.
కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, జిల్లా అధికార ప్రతినిధి ఉడతా వెంకటేశ్వరరావు, సొలస రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్ సుందరరావుతో మద్దూరి కోటిరెడ్డి

విద్యామిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టాక్ పాయింట్‌లను రాష్ట్ర బృందం నోడల్ ఆఫీసర్ ఎస్. గీత బుధవారం తనిఖీ చేశారు. వేసవి సెలవుల అనంతరం ప్రారంభం కానున్న నూతన విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు అందజేయాల్సిన యూనిఫాం, బ్యాగ్‌లు, టెక్ట్‌బుక్స్, నోట్ పుస్తకాల నిల్వ వివరాలను తనిఖీ చేశారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ అంతటినీ చేరవేయాలని ఆమె సూచించారు. శుక్రవారం నుండే డిమాండ్ మేరకు అన్ని పాఠశాలలకు మెటీరియల్ చేరవేసేందుకు సిద్ధమవుతున్నామని మండల రిసోర్స్ పర్సన్ మస్తాన్‌రావు నోడల్ ఆఫీసర్‌కు తెలియజేశారు. స్టాక్ పాయింట్‌లో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర సంబంధించిన రికార్డులను ఎస్. గీత తనిఖీ చేశారు. తనిఖీ బృందంలో జిల్లా పరిశీలకురు పి.వనజ, పల్నాడు జిల్లా సీఎంవో పి.పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్. గీత